## చలో ఉప్పల్ స్టేడియం

- నగరంలో వరల్డ్ కప్ సందడి షురూ..
- నేడు తలపడనున్న పాకిస్తాన్- నెదర్లాండ్స్
- మధ్యాహ్నం 2 గంటలకు పోటీ
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులు

సిటీబ్యూరో, అక్టోబర్ 5 ( నమస్తే తెలంగాణ ): నగరంలో వన్డే వరల్డ్ కప్ సందడి షురూ అయింది. ప్రపంచమంతా ఆసక్తిగా తిలకించే వరల్డ్ కప్ పోరుకు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం మూడు మ్యాచ్‌లకు వేదికగా కాగా.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పాకిస్తాన్- నెదర్లాండ్స్ మ్యాచ్ జరగనుంది. అక్టోబర్ 9న న్యూజిలాండ్- నెదర్లాండ్స్, అక్టోబర్ 10న పాకిస్తాన్- శ్రీలంక మధ్య పోటీ జరగనుంది. స్టేడియంలో మ్యాచ్ తిలకించే వారికి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు బీసీసీఐ ప్రకటించింది.

### ప్రత్యేక బస్సులు..

ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరగనున్న మ్యాచ్‌కు నగరంలోని 22 ప్రాంతాల నుంచి 56 సిటీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ గ్రేటర్ ఈడీ వి.వెంకటేశ్వర్లు గురువారం ప్రకటించారు. ఈ బస్సులు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8.30 గంటలకు అందుబాటులో ఉంటాయన్నారు. బస్సుల వివరాలకు ఉప్పల్- 9959226140, బండ్లగూడ-9959224058ను సంప్రదించాలని తెలిపారు.

## ప్రశాంతంగా వీక్షిద్దాం: సీపీ డీఎస్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఉప్పల్, అక్టోబర్ 5 : వరల్డ్ కప్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఉప్పల్ స్టేడియంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. ఆటగాళ్లు, ప్రేక్షకుల భద్రతకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పాస్‌లు, టికెట్లు లేనివారిని అనుమతించమన్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత హడావిడిగా వెళ్లవద్దని, ఎవరికి అనుమతించిన గేట్ల నుంచి వారే వెళ్లాలని కోరారు.

### పటిష్ట బందోబస్తు.. నిరంతర నిఘా..

స్టేడియం, పరిసర ప్రాంతాలలో 360 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. తక్షణ చర్యలకు సీసీ ఫుటేజీ పరిశీలన కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, 18 పార్కింగ్ స్థలాలతో పాటు, మహిళల భద్రత కోసం షీటీమ్స్, యాంటీ ఈవ్ టీజింగ్ టీమ్స్ ఉంటాయని చెప్పారు. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. గేట్ నం. 1, 3, 4, 7, 8లో ప్రత్యేక ఫోర్స్‌ను మోహరించామని, ప్రేక్షకులు నిషేధిత వస్తువులను స్టేడియంలోకి తీసుకురావద్దన్నారు. నిర్దేశించిన ప్రాంతాలలోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ప్రధాన రహదారుల్లో పార్కింగ్ నిషేధించామన్నారు. వైద్యసేవల కోసం అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. బ్లాక్ టికెట్ల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకీ, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

### స్టేడియంలోకి అనుమతి లేని వస్తువులు..

ల్యాప్‌టాప్, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరేట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, అగ్గిపెట్టే, లైటర్లు, పదునైన మెటల్ లేదా ప్లాస్టిక్ వస్తువులు, బైనాక్యులర్స్, నాణేలు, పెన్నులు, బ్యాటరీలు, హెల్మెట్లు, బ్యాగులు, ఫర్ఫ్యూమ్స్, బయటి తినుబండారాలు..

## వచ్చే నెల 23న..

### కేంద్రప్రభుత్వంపై మాదిగల యుద్ధభేరి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 23న కేంద్ర ప్రభుత్వంపై మాదిగల యుద్ధభేరి సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఈ సభకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగపల్లి శ్రీనివాస్ యుద్ధభేరి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తమ రాజకీయ అవసరాల కోసం వివిధ విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని గుర్తు చేశారు. న్యాయమైన వర్గీకరణ డిమాండ్‌ను మాత్రం పరిష్కరించడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కి తొమ్మిదేళ్లు పూర్తయినా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, విద్యార్థి నాయకులు వరిగడ్డి చందు, నాగరాజు, ధర్మారపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ అల్వాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ భరోసా యాత్రలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి


ఓల్డ్ అల్వాల్ బీఆర్ఎస్ పార్టీ భరోసా యాత్రకు హాజరైన ప్రజలు

# కాంగ్రెస్ ఝూటా మాటలు నమ్మొద్దు

- అల్వాల్ బీఆర్ఎస్ భరోసా యాత్రలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- అడుగడుగునా జన నీరాజనం
- మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపిస్తామని నినాదాలు

మల్కాజిగిరి, అక్టోబర్ 5 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఝూటా మాటలు చెబుతారని, ప్రజలు వాటిని నమ్మవద్దని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పనిచేస్తున్నదని పేర్కొన్నారు. గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ భరోసా యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర అల్వాల్ సర్కిల్‌లో మొదలై ఓల్డ్ అల్వాల్ ఐజీ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నియోజకవర్గానికి చేసిందేమీలేదని, కాంగ్రెస్ వాళ్లు ప్రచారానికి వస్తే ప్రజలు నిలదీయాలన్నారు. ఆ పార్టీ చేసిన మోసాలకు డిపాజిట్ కూడా రాదని, ప్రజలు వారిని నమ్మొద్దని సూచించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటారని, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నిరాశకు లోనుకావద్దని భరోసానిచ్చారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలువాలన్నారు. పేదలు ఆర్థికంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలనెలా పింఛన్ అందజేస్తున్నారని చెప్పారు. దళితబంధు పథకంతో అర్హులైన వారికి రూ.10లక్షలతో యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. మైనారిటీలకు రెసిడెన్షియల్ స్కూల్స్, మైనారిటీ బంధు, బీసీలకు బీసీబంధు అందజేస్తున్నామని తెలిపారు. తాగు, సాగునీరు, ఐటీ ఉద్యోగాలు, రోడ్లు, మహిళలకు రిజర్వేషన్‌తో పాటు అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మంత్రి ఉద్ఘాటించారు.

### అందరికీ ఉచితంగా వైద్య సేవలు: బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

ప్రజలందరికీ అరుంధతి దవాఖాన ద్వారా ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామని మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. భరోసా యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ... మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ఆపదలో ఆదుకుంటానని భరోసానిచ్చారు. అమ్మ పేరుతో అరుంధతి దవాఖానను దుండిగల్‌లో ఏర్పాటు చేశామని, గుండెతో పాటు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఉందజేస్తున్నామన్నారు. ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, సునీత రాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి, మురుగేశ్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్ గౌడ్, ఆకుల నర్సింగరావు, కోఆప్షన్ సభ్యురాలు జ్యోతిగౌడ్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, పరశురాంరెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, రాము యాదవ్, ఉపేందర్‌రెడ్డి, అనిల్‌కిశోర్, ఖలీల్, రాజేశ్‌కన్న, మోసిన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రానికి వ్యతిరేక వార్తలు రాస్తే.. దాడులు చేస్తారా?



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నేతలు

- కేంద్రప్రభుత్వం మీడియాపై దురుద్దేశంతోనే దాడులు
- పలు జర్నలిస్టు సంఘాల నేతలు..
- బషీర్‌బాగ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ

కవాడిగూడ, అక్టోబర్ 5: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ పని తీరుపై వార్తలు రాస్తే పాలకులు దాడులు, అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇదెక్కడి న్యాయమని పలు జర్నలిస్టు సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో న్యూస్‌క్లిక్ పోర్టల్ కార్యాలయంపై, జర్నలిస్టులపై పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తూ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెయూజే) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, కట్టా శేఖర్ రెడ్డి, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మీడియాను తమ ఆధీనంలోకి తీసుకోవాలనే దురుద్దేశంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలను ప్రచురిస్తే దాడులు, అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. మీడియా ఉన్నది ప్రజల కోసమని, ప్రభుత్వాల కోసం కాదని పాలకులు గ్రహించాలన్నారు. మీడియా స్వేచ్ఛను హరిస్తే ప్రజా ఉద్యమాలు మొదలవుతాయని హెచ్చరించారు. పాలకులు తమ వైఖరి మార్చుకొని మీడియా స్వేచ్ఛను కాపాడాలని హితవు పలికారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి దాడులు కేవలం న్యూస్ క్లిక్ మీద జరిగిన దాడిగా చూడొద్దని, ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడిగా చూడాలన్నారు. నిరసన ర్యాలీలు, ప్రతిఘటన నినాదాల ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛను మరింతగా ఉపయోగించుకొని మీడియాపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రమా మెల్కొటే, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, కాశీం, పీఓడబ్ల్యూ సంధ్య, జయ వింధ్యాల, గోవర్ధన్, సజయ, బి.రాజా, అనూరాధ, లింగస్వామి, తులసీ చంద్, జర్నలిస్టు సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పార్కు చేసిన ఆటోలు అపహరిస్తున్న డ్రైవర్ అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పార్కింగ్ చేసిన ఆటోలను అపహరిస్తున్న ఒక ఆటో డ్రైవర్‌ను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్‌కు చెందిన మండొళ్ల రాజు, సాయిప్రసాద్ ఆటో డ్రైవర్లు. వీరిద్దరూ స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలయ్యారు. డబ్బు సంపాదించేందుకు పార్కింగ్ చేసిన ఆటోలను అపహరించాలని ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పార్కు చేసిన ఆటోలను అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా బృందం రంగంలోకి దిగింది. రాజును అరెస్ట్ చేసి దొంగిలించిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. మరో నేరస్థుడు సాయి ప్రసాద్ పరారీలో ఉన్నాడు.